క్లుప్తంగా

తిరుచ్చిపై శ్రీహరి విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం దేవదేవేరులకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవల చేపట్టారు. ఈ క్రమంలోనే ఉభయదేవేరులతో శ్రీవారిని తిరుచ్చిపై కొలువు దీర్చి ఊరేగించారు.

పోటెత్తిన భక్తులు

పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ధ్వజస్తంభం వద్ద పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎంబీయూలో 'స్టూడెంట్ కాంగ్రెస్'



డాక్టర్ మూర్తిని సత్కరిస్తున్న ఎంబీయూ ప్రతిని

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో ఐఈఈఈ పీఈఎస్, పీఈఎల్ఎస్, ఐఏఎస్ జాయింట్ చాప్టర్, హైదరాబాద్ సెక్షన్ ఆధ్వర్యంలో స్టూడెంట్ కాంగ్రెస్–2025 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.చాప్టర్ డైరెక్టర్ డాక్టర్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తొలిసారిగా ఎంబీయూలో విద్యార్థులకు ఒకే వేదికపై మూడు సొసైటీలు కొత్త అవకాశాలను అందిస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో ఏఐ, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం కీలకమని వెల్లడించారు. వీసీ నాగరాజ రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ప్రొఫెసర్ కల్యాణ కుమార్ సేన్ మాట్లాడుతూ బలమైన ఇంజినీరింగ్ పునాదులపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

హనుమాన్ పతాకావిష్కరణ

రామచంద్రాపురం : మండలంలోని గోకులాపురంలో శనివారం బోణుగుట్టపై 20 అడుగుల ఎత్తులో హనుమాన్ పతాకం ఆవిష్కరించారు. ఈ మేరకు స్థానిక యువత ముందుగా వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటం ఊరేగించారు.

సాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు

తిరుపతి తుడా : నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లలో 0877-22256776, 9000822909 సంప్రదించాలని కమిషనర్ మౌర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి వాసుల కోసం కార్పొరేషన్ కార్యాలయంలో సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.



జెండా ఎగురవేస్తున్న యువకులు

రూరల్ ఎంఈఓగా పద్మజ



పద్మజకు అభినందలు తెలుపుతున్న సిబ్బంది

తిరుపతి రూరల్ : రూరల్ మండల విద్యాశాఖ అధికారిగా పద్మజ శనివారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ జిల్లా సిద్ధవటం మండలం నుంచి ఆమె బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా సిబ్బంది అభినందనలు తలిపారు.

బయటపడిన శివ లింగం



పూజలు చేస్తున్న భక్తులు

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం నెరబైలులోని గుడిమిట్ట సిద్ధేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనుల నిమిత్తం చేపట్టిన తవ్వకాల్లో శివలింగం బయటపడింది. ఈ విషయం తెలియడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి శివలింగానికి విశేష పూజలు నిర్వహించారు.

తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో..



వేదాంతపురం అగ్రహారం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



వర్షపు నీరు.. రోడ్ల పైకే చేరు!

చినుకు పడితే రహదారి చిత్తడిగా మారుతోంది. జోరు వాన కురిస్తే నీటి మడుగులా మారుతోంది. వర్షపు నీరు వెళ్లే కాలువలు కబ్జా కోరల్లో చిక్కడంతో పరిస్థితి దారుణంగా మారింది. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడాల్సి వస్తోంది. వరదకు మురుగు తోడు కావడంతో ముక్కుమూసుకుని బతకాల్సిన దుస్థితి దాపురించింది. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల వారు నరకయాతన అనుభవిస్తున్నారు. దుర్వాసనతోపాటు విషజీవులతో సహవాసం చేస్తూ దినదిన గండంగా జీవనం సాగించాల్సి వస్తోంది.

- కాలువల కబ్జాలతో ముంపునకు గురవుతున్న గ్రామాలు
- వరదకు తోడవుతున్న మురుగు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు
- దుర్వాసనతో రోగాల బారిన పడుతున్న ప్రజలు

తిరుపతి రూరల్ : మండలంలోని పలు గ్రామాల ప్రజలు వర్షాకాలం నానా అవస్థలు పడుతున్నారు. కాలువలు, కల్వర్టులనే తేడా లేకుండా ఆక్రమణ బారిన పడడంతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రధానంగా కేసీపేట నుంచి భాగ్యనగరం మీదుగా వెళ్లే రహదారికి, పద్మగిరి కొండకు సమీపంలోని నల్లవాని కాలువను గతంలో పూర్తిగా మూసివేసి రోడ్డు నిర్మించేశారు. దీంతో కాలువలో ప్రవహించాల్సిన వర్షపు నీరు గ్రామాన్ని చుట్టేసింది. పురాతన కాలం నాటి కాలువ రెవెన్యూ రికార్డుల్లో కనబడుతుందే కానీ ఆనవాలు కూడా లేకుండా కబ్జాదారులు చెరపట్టేశారు. దీంతో వరద నీరు కాస్త రోడ్డుపైకి చేరి నీటి గుంతలను తలపిస్తోంది. అటుగా వెళ్లే వాహనదారులు, రైతులు ఆ నీటిలో వెళ్లలేక పడరాని పాట్లు పడుతున్నారు. వర్షపు నీటికి మురుగు తోడై తనపల్లె వీధుల్లోకి చేరుతోంది. దీంతో దుర్వాసన భరించలేక స్థానికులు ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. వర్షపునీరు, మురుగు కలిసి వీధుల్లో ప్రవహిస్తుండడంతో విషపురుగులు ఇళ్లలోకి వచ్చేస్తాయనే ఆందోళన నడుమ జీవనం సాగిస్తున్నారు. నల్లవాని కాలువను పూడ్చి సిమెంటు రోడ్డు వేయడం వల్లే ఈ దుస్థితి దాపురించిందనే వాస్తవాన్ని గ్రామస్తులు గుర్తించారు. అయితే ఆ నీటి ఎలా మళ్లించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



తనపల్లెలో వరదనీరు

కల్వర్టులను పూడ్చేయడంతో..

జాతీయ రహదారి నుంచి రామచంద్రాపురానికి వెళ్లే మార్గంలో వేదాంతపురం అగ్రహారం వద్ద అవిలాల చెరువుకు చేరాల్సిన నీరు కల్వర్టులను పూడ్చివేసిన కారణంగా రోడ్డుపైకి పొంగుతోంది.వేదాంత పురం అంబేడ్కర్ కాలనీ వద్ద కూడా వర్షపునీరు నిల్వ ఉండటంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి జాతీయ రహదారిపైకి చేరుకునే మార్గంలో తబూన్ హోటల్ వద్ద రహదారి కాస్త నీటి మడుగును తలపిస్తోంది. వర్షపునీటి లోతు ఎంతో తెలియకపోవడంతో వాహనదారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా తిరుపతి శివారు ప్రాంతాల్లో కాలువలను మూసివేయడంతో వరదనీరు నానా బీభత్సం సృష్టిస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి రికార్డుల ప్రకారం కాలువలను పునరుద్ధరించాలని, ఆక్రమణలను తొలగించాలని, గ్రామాల్లో నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కమనీయం.. కల్యాణం



విశేషాలంకరణలో దేవదేవేరులు

పాకాల : మండలంలోని కొండకిందపల్లెలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దేవదేవేరులకు కమనీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవర్లను సుగంధ ద్రవ్యాలు, పవిత్ర నదీ జలాలలో అభిషేకించారు. మూలవర్లను శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాల పంపిణీతోపాటు అన్నదానం చేపట్టారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల కేంద్రమంత్రి మురుగన్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

జూపార్క్‌లో కీపర్స్ డే



సర్టిఫికెట్ అందిస్తున్న క్యూరేటర్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఎస్వీ జూపార్క్‌లో శనివారం అంతర్జాతీయ జూ కీపర్స్‌డే నిర్వహించారు. క్యూరేటర్ సి.సెల్వం, సహాయ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ మాట్లాడుతూ వన్యప్రాణి సంరక్షణతో జూ కీపర్స్ అందిస్తున్న సేవలు అమూల్యమన్నారు. జంతు ఉద్యానవనానికి నిజమైన పరిరక్షకులుగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం విశిష్ట జంతు పరిరక్షకులను సత్కరించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దుర్మార్గం

పాకాల : చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దుర్మార్గమని, నిందితులను కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పోరాటం సాగించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కేవీపీఎస్ నేతలు రవి, నరేంద్ర, సాంబశివ, ఆనంద, హరి, మోహన్‌బాబు, వేణు, చంద్ర, సరస్వతి, శివ, చిట్టిబాబుపాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్ : అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని రాయలసీమ మాలల జేఏసీ కన్వీనర్ మల్లారపు మధు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దళితుల మనోభావాలను పరిరక్షించాలని కోరారు. లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

బస్సులు లేక పడిగాపులు



రాయచోటి ప్లాట్‌ఫామ్ వేచి ఉన్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్ : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిని బస్సుల కొరత వేధిస్తోంది. సెంట్రల్ బస్టాండ్‌లో ప్రయాణికులకు పడిగాపులు తప్పడం లేదు. ప్రధానంగా రాయచోటి, పీలేరు, కాణిపాకం, బద్వేలు తదితర ప్రాంతాలకు సరిపడా సర్వీసులు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్లాట్‌ఫామ్ వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఏడాదిలోపు ఒక్కో డిపోకు అదనంగా 50 బస్సులు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో పెట్టలేదు. ముఖ్యంగా నిరంతరం రద్దీగా ఉండే తిరుపతికి ఒక్క బస్సును కూడా కొత్తది కేటాయించలేదు. ఈ క్రమంలోనే పలు మార్గాల్లో బస్సుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పలువురు ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రైవేటు బస్సుల కోసం వెతుక్కుంటూ వెళ్లిపోతున్నారు. ప్రయాణికుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్ని డిపోలకు కొత్త బస్సులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అడుగడుగునా అలసత్వం



కాలువపై ఏర్పాటు చేసిన సెంట్రింగ్ షీట్లు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట మార్గంలో డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. కాలువపై ఇనుప మెష్ సిద్ధం చేసినప్పటికీ అధికారుల అలసత్వం కారణంగా ఇప్పటికీ అమర్చలేదు. దీంతో పలువురు పాదచారులు కాలువలో పడిపోతున్నారు. మెష్ కమ్మీలు సైతం తుప్పుపట్టే పరిస్థితికి చేరుకున్నాయి. ఇటీవల తుమ్మలగుంటలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. కాలువపై సెంట్రింగ్ షీట్లను వేయించారు. అయితే సమస్యను శాశ్వతంగా పరిష్కరించే అవకాశమున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వగ్రామమనే కారణంతో కూటమి నేతలు సైతం అభివృద్ధి పనులకు మోకాలడ్డుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజా ధనం వృథా కాకుండా ఇనుప మెష్‌లను డ్రైనేజీకి అమర్చాలని కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సిద్ధం చేసిన ఇనుప మెష్‌లు

పీహెచ్‌సీ వైద్యులకు 'హంస' మద్దతు



వైద్యులకు మద్దతు తెలుపుతున్న నేతలు

తిరుపతి తుడా : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట కొన్ని రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం ధర్నా చేస్తున్న వైద్యులను కమిటీ సభ్యులు పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హంస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, జిల్లా కోశాధికారి ఇమ్రాన్, సిటీ అధ్యక్షుడు సురేంద్ర, సెక్రటరీ మునిరాజా, కోశాధికారి శాంత కుమార్ పాల్గొన్నారు.

ఏడాదిగా దక్కని 'గౌరవ'ం!

ఎంపీటీసీ సభ్యులను కూటమి ప్రభుత్వం దారుణంగా అవమానిస్తోంది. వైఎస్సార్‌సీపీ సభ్యులని అడుగడుగునా చిన్నచూపు చూస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారిని తీవ్రంగా వేధిస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది నుంచి గౌరవ వేతనం సైతం చెల్లించకుండా కాలయాపన చేస్తోంది. రాజకీయ కక్షతో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోంది.

- ఎంపీటీసీ సభ్యులకు అందని వేతనం
- వైఎస్సార్‌సీపీ సభ్యులని ప్రభుత్వ నిర్లక్ష్యం
- సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లించాలని ఎంపీపీ ఆదేశం



క్యాష్ బుక్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండల పరిషత్‌లో మొత్తం 40 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అందులో ఒక స్థానానికి ఎన్నిక జరగలేదు. మరో ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు మృతి చెందారు. దీంతో ప్రస్తుతం 37 మంది ఎంపీటీసీ సభ్యులే ఉన్నారు. వీరిలో 36 మంది వైఎస్సార్‌సీపీకి చెందినవారే. మిగిలిన ఒక్కరు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. మండలంలో టీడీపీకి ఒక్క స్థానం కూడా లేదు. దీంతో రూరల్ మండలంపై ప్రభుత్వం కక్షగట్టింది. సుమారు ఏడాదిగా ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లించకుండా కాలయాపన చేస్తోంది.

ఇవ్వడానికి ఇష్టంలేకనే!

రాష్ట్రంలోనే అతిపెద్ద మండలమైన తిరుపతి రూరల్‌కు ప్రతి నెలా రూ.లక్షల్లో నిధులు వస్తుంటాయి. అయినప్పటికీ తమకు గౌరవ వేతనం ఇవ్వకుండా కావాలనే వేధిస్తున్నారని ఎంపీటీసీ సభ్యుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎంపీటీసీ సభ్యునికి రూ.3 వేల చొప్పున గౌరవ వేతనం అందాల్సి ఉంటుంది. ఆ లెక్కన మొత్తం ఏడాదిగాను రూ.13.32 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వానికి ఇష్టం లేకనే జాప్యం చేస్తోందని ఎంపీటీసీ సభ్యులు ఆరోపిస్తున్నారు.

నమోదు కాని జమా ఖర్చులు

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఆలస్యం కావడం, వారికి కేటాయించిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు విడుదల చేయకుండా ఆలస్యం చేస్తుండడంతో ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మండల పరిషత్‌సాధారణ నిధులకు సంబంధించి జమాఖర్చులను ఆరా తీశారు. ఎంపీడీఓ కార్యాలయంలోని క్యాష్ బుక్‌లో జమ, ఖర్చులు నమోదు చేయకపోవడం గుర్తించారు. దీనిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సాధారణ నిధుల నుంచి వెంటనే ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లించాలని ఆదేశించారు.